## కె.పి.ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు



శివరావుకిప్పుడు 74 ఏళ్లు. జీవితంలో యెన్నో ఒడు దుడుకుల నెదుర్కొన్నాడు. వాళ్ల నాన్న ఓ పెద్ద లాయరు.... "నిన్ను బి.ఎ. ప్యాసు చేయిస్తారా?" అనేవాడు. చివరికి తనకు స్కూలు చదువుకన్నా ఎక్కువ చెప్పించలేకపోయాడు. ఆ ఎస్.ఎస్.ఎల్.సి., చదువుతోనే, ఆంధ్ర సర్వీసు కమీషను పరీక్ష వ్రాసి ఎల్.డి.సి గా సెలెక్టయ్యాడు. వైద్య శాఖలో ఉద్యోగం చేసి, అంచెలంచెలుగా పైకి వచ్చి, గెజిటెడ్ ఆఫీసరు అయ్యాడు. తన మేనమామ కూతురినే పెండ్లి చేసుకున్నాడు. ముగ్గురు మగ పిల్లలను, ఓ ఆడ పిల్లనూ కన్నాడు.

1951నుంచీ కథలు వ్రాయటం మొదలెట్టాడు. దాదాపు అన్ని పత్రికలూ అతని కథలు ప్రచురించాయి. ఓ చిన్న కథకుడిగా పేరు తెచ్చుకున్నాడు. శివరావు తనకెవరూ సన్మానం చెయ్యలేదే అని బాధపడే వాడు. అయితే అతను నెల్లూరులో పనిచేస్తుండగా ఓ తమాషా జరిగింది.

జిల్లా వైద్య శాఖాధికారి ఆఫీసులో అప్పుడు శివరావు పనిచేసే వాడు. ఆఫీసులో యింకా ఇద్దరు సూపరిండెంట్లు ఉన్నారు. ఒక సూపరిండెంట్ పేరు విశ్వేశ్వరరావు. ఆయన కవిత్వం వ్రాసేవాడు. చాలా కవితలు అచ్చయినాయి కూడా.

ప్రభుత్వం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రారంభం చేసి, రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నది. ప్రతి జిల్లాలో ఓ ఫ్యామిలీ ప్లానింగు ఆఫీసరు పదవి సృష్టించబడ్డది. నెల్లూరు ఫ్యామిలీ ప్లానింగు ఆఫీసరుగారు కుటుంబనియంత్రణ అనే విషయం మీద కవి సమ్మేళనం జరిపి తొమ్మిది మంది జిల్లా కవులను సన్మానం చెయ్యాలని నిశ్చయించుకున్నారు. అప్పుడు సూపరిండెంట్ విశ్వేశ్వరరావు, శివరావులకు ఈ విషయం మీద సంభాషణ జరిగింది.

"శివరావుగారూ! మీరు కూడా ఈ విషయం మీద గేయాలు వ్రాయండి. నేనెలాగూ వ్రాస్తాను. మీరు వ్రాస్తే మీకూ.... నాకూ.... సన్మానం జరుగుతుంది" అన్నాడు.

ఆయన మాటలకు శివరావు ఆశ్చర్యపోయాడు.

"అదేమిటి నేను కవిని కాదు కదా." కథకుడిని మాత్రమే! మీరంటే కవులు...... మీరు వ్రాస్తారు.... నేనేమి యింత వరకు వ్రాయలేదే?" అన్నాడు శివరావు.

"ఛందోబద్ధంగా కవిత్వం వ్రాయటం కష్టమేమోగాని, గేయాలు రాయటం చాలా తేలిక. మీరు ప్రయత్నిస్తే వ్రాయగలరు. ఆ ధైర్యం నా కుంది. మీరు వ్రాయాలి..... మీరూ.... నేనూ.... ఇంకా ఏడుగురికి సన్మానం జరుగుతుంది" అన్నాడు గట్టిగా విశ్వేశ్వరరావు.

శివరావుకింక గేయాలు వ్రాయడం తప్ప లేదు. రాత్రంతా మేలుకొని నాలుగు పేజీలు రాసేసాడు. విశ్వేశ్వరావుకి చూపించాడు.

"బావున్నాయి..... నిక్షేపంగా ఉన్నాయి. ఈ మాదిరి వుంటే చాలు. ఇంతకన్నా ఎవరు వ్రాస్తారు?" అన్నాడు అతను.

విశ్వేశ్వరావు ఫ్యామిలీ ప్లానింగు కవుల సమ్మేళనానికి అన్ని ఏర్పాట్లూ చేశాడు. సన్మాన సభ.... టౌను హాల్లో జరుగుతోంది.

వేదిక మీద అధ్యక్షుల వారికీ, కవులకు కుర్చీలు అమర్చబడ్డాయి. సభకి జనం చాలా మంది వచ్చారు. ఆ నగర మున్సిపాలిటీ ఛైర్మను గారు అధ్యక్షత వహించారు. ముందుగా.... కుటుంబనియంత్రణ అవసరం గూర్చి.... క్లుప్తంగా ఉపన్యసించారు. తర్వాత కవులు తమ తమ రచనలు విన్పించారు.

శివరావు వంతు వచ్చింది. తను వ్రాసిన గేయాలు... చక్కగా చదివాడు. సభలో కరతాళ ధ్వనులు మ్రోగాయి.

తర్వాత కవులందరికీ ఎర్రటి శాలువాలు బహూకరింప బడ్డాయి. శివరావు మెడలో దండ వేసి శాలువా కప్పారు. శివరావు శరీరం ఆనందంతో పులకరించిపోయింది.

సభ జయప్రదంగా ముగిసింది. సభలో శివరావు చదివిన 'గేయాలు' ఆ మధ్య కనపడ్డాయి.... మళ్ళీ కనపడలేదు.

ఏది అయిన తర్వాత ఫ్యామిలీ ప్లానింగు ఆఫీసరు గారు వచ్చి "మీరు గూడా కవితలు వ్రాస్తారా? మీ గేయాలు బాగున్నాయి!" అంటూ అభినందించాడు.

శివరావుకి కొండెక్కినంత ఆనందమయింది.

❊ ❊ ❊

ఒక రోజు శివరావు దిన పత్రికలో ఓ వార్త చూసాడు.... "శ్రీ శంకరం గారికి ఉగాది పురస్కారం!" అని.... బొమ్మ లేసారు. శంకరానికి ఎవరో శాలువా కప్పుతున్నారు ఇంకెవరు? ఆ పుర ప్రముఖుడే. క్లుప్తంగా శంకరం ఉపన్యాసం పడింది.... 'సాహిత్యం ప్రజల కోసం.... వారిని మంచి మార్గంలో నడిపించటానికి ఉపయోగపడాలి. నేటి రచయితలంతా ప్రజలకుపయోగించే కవితలూ, కథలూ వ్రాయాలి!" అంటూ అందులో శంకరం గారు ఇంతవరకు చేసిన కృషిని ప్రస్తావించారు. రామాయణ, భాగవతాల మీద... ఆయన వ్యాఖ్యలు... కథలు రేడియోలో ప్రసారమయ్యాయి.... ఆయన అనేక ప్రజాహిత కార్యక్రమాలలో పాల్గొని సాహిత్య కృషి చేస్తున్నారు. ఆయన స్థానిక రచయితల సంఘానికి పదేళ్లుగా సెక్రటరీగా ఉన్నారు (అది నిజమే!) అనేక మంది కవులను, పండితులను పిలిపించి వారి చేత ఉపన్యాసాలు యిప్పించి, సాహిత్య అభివృద్ధికి పాటుపడ్డారు. ఆయన రచించిన ఫలానా కథల సంకలనాలు మంచి పేరు తెచ్చుకున్నాయి" ఇలా సాగాయి పత్రికలో అచ్చయిన విశేషాలు.....

ఎవరీ శంకరం? అతనికింత పేరెందుకొచ్చింది? ఆయన కథ ఒక్కటీ ఏ పత్రికలోనూ తనింతవరకు చూడలేదే? చాలా సాహిత్య సభలు నిర్వహించాడు ఆ మాట నిజమే! మరి కథల విషయం! ఏ ఒక్కటీ ఏ పత్రికలోనూ తను చూడలేదు.

మరెందుకీ సన్మానం? స్థానిక రచయితల సంఘం అతని చేతిలో ఉంది. ఆ సభ్యుల కెందరికో ఆయన కలెక్టరు గారి దగ్గర నుంచి తమ రచనల ప్రచురణ కోసం... ఆర్థిక సహాయం చేయించాడు.

ఇంతకీ వింతేమిటంటే ఈ శంకరం.... శివరావుకి ప్రభుత్వ సర్వీసులో చాలా జూనియరు! తను జిల్లా ఆఫీసులో పనిచేస్తున్నప్పుడు, అతనొక పల్లెటూరిలో పని చేసేవాడు. తననెలాగైనా నగరానికి బదిలీ చేయమని తననర్థించాడు. అతను తన కులమే, తనశాఖే నన్నాడు. శివరావుకి యితరులకు సహాయం చేసే గుణముంది, జిల్లా ఆఫీసరుకి చెప్పి.... అతనిని తన కార్యాలయానికే బదిలీ చేయించాడు. తర్వాత రెండు సంవత్సరాలకు తను ఆ కార్యాలయం నుంచి వేరే జిల్లాకు బదిలీ అయ్యాడు.

## పాయసం పద్యాలు

### వసంతం

చివురు సిరులు తొడగె కొమ్మ
పూత బరువుకు వాలె రెమ్మ
కూత శ్రుతులు పలికె కోకిలమ్మ
వసంతమా నీకిక స్వాగతమ్మ!

### పొలిట్రిక్స్!

ఉదయాన్నే భుజం మీద చెయ్యి
రాత్రయితే వెన్ను పోటు తియ్యి
అవకాశం ముందు ఆదర్శం నిల్లంట
చెప్పక చెయ్యడమే రాజకీయ థ్రిల్లంట!

### దోమల బాధ!

నాటు వైద్యుడి కాన్నా మోటుగా
వేస్తాయి సూదులు ఇవి రాక్షసి దోమలు!
పగలూ రాత్రీ రెస్టు లేదు హాపీగా
రక్తం పీల్చేస్తాయి మున్సిపాల్టీ పెంపుడు భామలు!!
పారిశుద్ధ్యం అంతంత మాత్రం వుండగా
పాపిష్టివి బలిశాయి ఏనుగులకు మల్లే!
ఉండీ జెట్ బిళ్ళలు దండగ
వాటి ధాటికి మనం మారుతాం పీనుగలల్లే!!

### తిండిపురాణం!

టిఫినైతే చారానా, మీల్సైతే బారానా
ఆరోజులే వేరు తిరిగిరావు సింగిలరూ!
ఇప్పుడైతే చప్పబిళ్ళే, హోటళ్ళ తినబళ్ళే
టిఫినంటే 'దస్' మీల్సంటే 'బీస్' బ్యాచిలరూ!!

**- పాయసం సుబ్రహ్మణ్య మహర్షి**

అప్పుడు జిల్లా కార్యాలయంలో శంకరం ఓ వెలుగు వెలిగాడు. ఆఫీసరుని బుట్టలో వేసుకున్నాడు. మందుల కొనుగోలులో బోలెడు సంపాయించాడనీ అందరూ అనుకుంటూంటే శంకరం చెవిని గూడా పడింది. తర్వాత తను పదవీ విరమణ చేసాడు తన కథలు రేడియోలో ప్రసారమయ్యేవి. సాహితీ సభలకు తనకు గూడా ఆహ్వానం వస్తుండేది. తన కథా సంపుటి త్వరలోనే, వెలుగు చూడబోతున్నది.

ఆ శంకరమే యిప్పుడింత యెత్తుకు ఎదిగాడన్నమాట.

శివరావుకి నెల్లూరులో తనకు కవిగా సన్మానం జరిగిన విషయం జ్ఞాపకానికొచ్చి నవ్వుకున్నాడు. తను కవిగాడు. అయినా ఏదో రాసిన దానికి సన్మానం జరిగింది. ఎందుకు? సన్మానం చేసిన వాళ్ళు తన కార్యాలయం వాళ్లు!

శంకరానికి.... నిజంగా... కథకుడిగా పేరు రాలేదు. ఆయన కథలు పత్రికలలో రాలేదు. అయినా సన్మానం జరిపించుకున్నాడు. మరి దాని కోసం అతనెంతమందిని ఆశ్రయించాడో! తనకు మాలిన ధర్మం లేదు గదా!

తనకీ, శంకరానికి తేడా ఏమిటి? నవ్వుకున్నాడు శివరావు. ఇదే సాహితీ లోకం అనుకున్నాడు.

మరి మీరూ నవ్వుతారా?

